## ▼ఈ వారం కథ




(మార్చి 8, అంతర్జాతీయ మహిళా దినోత్సవం)

"చెట్టులాంటి కొడుకు మంచం పట్టాడు. రోజెలా గడుస్తుందో" నిట్టూర్చింది బుల్లమ్మాయి. ఎండ్రిన్ తాగి చచ్చిపోయిన మొగుడు కూడా ఆ కష్టకాలంలో గుర్తుకొచ్చాడు. ఇంత సంసారాన్ని చేతికందిరాని పిల్లల్ని నట్టేట్లో ముంచిపోయాడు. ఎలా బతుకుతామనుకొన్నాడు? దిక్కూ మొక్కూ లేని ఆడది ఎలా ఈదుతుందనుకొన్నాడు?

భర్త పోయినప్పుడు ఇరుగూ పొరుగూ సాయం చేశారు. సీతమ్మ రోజూ అన్నమూ కూరలూ పంపేది. చేతనైన సాయం చేసేది. "ఎందుకు బుల్లమ్మాయ్ అంత బెంబేలు పడిపోతావ్. కష్టాలు ఎల్లకాలం వుంటాయా? దేవుడు చల్లగా చూస్తే పిల్లలు తొందర్లోనే చేతికందిరారా?" అంటూ ఓదార్చేది సీతమ్మ.

పదేళ్ళ చిన్న కొడుకుని బడి మానిపించి ఆచారి గారింట్లో పనికి వుంచింది బుల్లమ్మాయి. నెలకి 50 రూపాయల కూలీ. రెండు పూట్లా భోజనం. "ఏదో వాడి పొట్ట గడుస్తుంది" అని సంతృప్తిపడింది. పెద్ద కొడుకు త్రిమూర్తులు కూలికి వెళ్లడం మొదలుపెట్టాడు. ఇంతకీ వాడి వయస్సెంత? పధ్నాలుగో పదిహేనో అంతే. తప్పతుందా? రెక్కాడితే గానీ డొక్కాడదు. బుల్లమ్మాయి సీతమ్మగారింట్లో అంట్లు తోమే పనికి కుదిరింది. ఎవరూ చూడకుండా తెల్లవారుజామునే పని పూర్తిచేసుకొని, కాకులు కూసేప్పటికి ఇంట్లో వుండేది. మరి కాపు కులంలో పుట్టింది. గడపదాటి ఎరగదు. ఎవరైనా చూస్తే ఏమనుకొంటారు? "ఆయమ్మగారి గడప తప్ప మరెవరి గడపా తొక్కను."

త్రిమూర్తులే ఇంతకాలం బండి లాగుతూ వచ్చాడు. చెల్లెల్ని వొక ఇంటిదాన్ని చేశాడు. రోజంతా కష్టపడి రెక్కలు ముక్కలు చేసుకొని ఇంట్లో ఏ లోటూ రాకుండా చూశాడు. వాడికి గత సంవత్సరమే పెళ్లైంది కూడా. "అమ్మా తల పగిలిపోతోందే సచ్చిపోతానే" అంటూ వొకటే యేడుపు. "నాయనో మాయ రోగ్గం వచ్చిందిరో నాయనో నా మొగుణ్ణే తీసుకుపోయినా, ఆ దేవుడి సచ్చినోడి కళ్లు చల్లబడలేదురో నాయనో."

చుట్టుపక్కల గుడిసెల్లోని జనం మూగారు. వాళ్ల కళ్లల్లోనూ నీళ్లు. అసలా అమాయక జనం జ్వరమొచ్చినా సరే ముందు శోకాలు పెడ్తారంతే. వాళ్లకి ప్రాణం తీసే జబ్బుకీ చిన్న అనారోగ్యానికీ తేడా తెలీదు.

త్రిమూర్తులు ఎన్ని చెరుకు మోపులు మోసేవాడు? వాడితో ఎవరు పోటీ పడగలరు కాయకష్టంలో? బరువు మోస్తూంటే కండలు కొండల్లా తన్నుకొచ్చేవి. ఈ మాయ జబ్బేమిటో ఏనుగులాంటి వాణ్ణి పీల్చి పిప్పి చేసేసింది. జ్వరమని మందులిస్తున్నారు ఆచారిగారు. "అమ్మా తొందరపడ్తే ఎలా? దేవుడు దయతలవాలి. మందులు పట్టేయ్యాలి" ఓదార్చారు.

కుండపోతగా వర్షం. చూరునుంచి నిర్దయగా నీరు. త్రిమూర్తులు మంచంపైన కూడా బొట్లు బొట్లు. వాడు ఇళ్లు నేయాలని తెచ్చిన తాటాకులు వానలో తడిసి చివికి పోతున్నాయి. ఆ తాటాకుల్ని చూస్తూ నీరైపోయింది తల్లిగుండె. "ఎంతపని చేసేవాడివో నాయనో అలుపే ఎరగవు, దేవుడు కట్టాలే రాశాడురో..."

అపస్మారక స్థితిలో పలవరింతలు. గర్భిణిగా చచ్చిపోయిన ఎదురింటి అమ్మాయి దెయ్యమై పట్టుకుందేమోనని మంత్రించిన విభూతి నుదుటికి పెట్టి నీళ్లల్లో కలిపి తాగించింది బుల్లమ్మాయి. విభూతీ పనిచేయలేదు, ఆచారిగారి మందులూ పనిచేయలేదు. ఆ రెండూ వొకలాంటివేనని కొందరు చమత్కరిస్తారు. ఐనా అంతకంటే ఆ వూరికి గతేముంది? వైద్యవిద్యను సక్రమంగా అభ్యసించిన వాడెవడూ ఆ వూళ్లో లేడు. స్వంత అనుభవంతోనే లాగించేస్తారు. తర్వాత దేవుడి దయ. ఆచారిగారు అంటుంటారు "వైద్యానికి హస్తవాసి వుండాలేకాని చదువులెందుకండీ" పాము, తేలు మంత్రాలూ, భూతవైద్యమూ, ఆచారి వైద్యమూ



— ఆర్. శివశంకరశర్మ

సహజీవనం చేస్తున్నాయి ఆ వూళ్లో. ఆచారి గుళ్లో పూజారి కూడా.

ఆచారిగారు తనవల్ల కాదని కాకినాడ తీసుకు పొమ్మని చెప్పేశారు. కాకినాడలో పిల్లవాణ్ణి వుంచి వైద్యమంటే మాటలా? శేషమ్మ కొడుకుని వారం రోజులు కాకినాడ ఆస్పత్రిలో వుంచితే వెయ్యికి పైగా అయిందట. దొరబాబుల రోగం వచ్చిందని బుల్లమ్మాయి వొకటే ఏడుపు.

త్రిమూర్తులకీ దిగులు. తన బిడ్డల్నీ భార్యనీ చూస్తూంటే దిగులు మరీ ఎక్కువౌతోంది. అసలు రోగం కంటె ఈ భయమూ దిగులే ఎక్కువ సలుపు. భార్య పుస్తెలతాడూ, బుల్లమ్మాయి దగ్గరున్న కొద్ది బంగారమూ ఆవిరైపోయాయి. అందరి రెక్కలూ ఆడడం మానేశాయి. పైగా హోటలు తిండీ, మనుషుల్ని తినేసే ఖరీదైన మందులూ. కాకినాడ వైద్యం దెయ్యమై పట్టుకొంది. ఇంట్లో గిన్నెలూ తపేలాలూ కూడా తాకట్టుకి తరలిపోతున్నాయి. ఆ డాక్టరు బాబులు తెల్ల కాగితంపైన అరక్షణంలో బరికి,చిర్నవ్వుతో చేతిలో పెడ్తారంతే. ఆ కాగితం మందుల దుకాణానికి పట్టుకెళ్తే, రెండో మూడో వందనోట్లు హుష్‌కాకీ. పైగా డాక్టరు ఫీజులూ, వైద్య పరీక్షలూ!

ఆ బాబుల దుస్తులూ, వారి చిరునవ్వు ఎంత స్వచ్ఛంగా, సౌమ్యంగా మెరిసిపోతాంటాయి? వాళ్ల పలకరింపులూ మాటల్లో ఎంత ఆత్మీయత? కానీ డబ్బుని జలగల్లా పీల్చేస్తారు. అందరూ వాళ్ల కళ్లకి వొకటే. నెత్తురున్నోళ్లని లేనోళ్లని సమానంగా పిండుతారు. ఐదు రూపాయల వడ్డీకి అప్పు తెచ్చి నెత్తురు కొంది బుల్లమ్మాయి. "డబ్బుండాలి కాని అన్నీ అమ్ముతారు. గుండెకాయలు కూడా అమ్ముతార్ట" వొకరు. "తిండికోసం కిడ్నీలు కూడా అమ్ముకొంటున్నారట" మరొకరు.

త్రిమూర్తుల్ని డిశ్చార్జి చేశారు. టానిక్కులు రాసిచ్చారు. "మంచి పౌష్టికాహారం ఇవ్వాలి" అన్నారు డాక్టర్లు. "అంటే?" అమాయకంగా అడిగింది బుల్లమ్మాయి. "మంచి కూరగాయలూ, ఆకుకూరలూ, గుడ్లూ, మాంసమూ, బిస్కట్లూ, పాలూ..." వులికిపడింది. మందులంటే ఎలాగో కొనచ్చు. అంత ఖరీదైన తిండి ఎక్కడినుంచి తేగలదు?

"త్రిమూర్తుల్ని తీసుకొచ్చేశానమ్మా" అంది ఆనందంగా సీతమ్మతో. లోపల దిగులే. వాడింకా నాలుగు నెలలు మంచం మీదనే. ఎప్పుడు కోలుకుంటాడో, కూలికెళ్తాడో, చెరుకు మోపులు భుజానికెత్తుకుంటాడో? వాడి భార్య కాని తానుకాని ఎప్పుడూ కూలికెళ్లింది లేదు. అయినా ఆడదాని కూలీ ఎంత?

బుల్లమ్మాయి అంట్లుతోమే పనికెళ్తూనే వుంది. సీతమ్మకీ బుల్లమ్మాయికీ చాలా అనుబంధం. భర్తపోయినప్పుడు ఓదార్చి సాయం చేసినందుకు ఆమెకు సీతమ్మంటే కృతజ్ఞత, ప్రేమ.

కానీ దరిద్రం ఎంత భయంకరం? అది ఎంత విషాదాన్నీ అల్లకల్లోలాన్నీ మనస్పర్థల్నీ పెంచుతుంది? అంత ఆత్మీయంగా మసలే వారిద్దరి మధ్యా పచ్చగడ్డి భగ్గుమంది.

ఒక బంధువు సీతమ్మ చెవి కొరికాడు, బుల్లమ్మాయి తెల్లవారుజామున బియ్యమూ కూరగాయలూ దొంగతనంగా తీసుకుపోతోందని. అది నిజం కావచ్చు, కాకపోవచ్చు. కానీ అది నమ్మే సమయం మరి. బుల్లమ్మాయికి ఇల్లు గడవడమే కష్టం. గౌరవంగా హుందాగా గడిపిన కాలం వెళ్లిపోయింది. దరిద్రం తాండవిస్తోంది. కొడుకు కోలుకొన్నా ఇల్లు వొక్కసారిగా కోలుకోదు. వాడు కూలికెళ్లినా మామూలు పరిస్థితి వచ్చేస్తుందా? అప్పులూ సొప్పులూ. అంతా చిందరవందర. "ఆ ఏడు కొండలవాడే కాపాడాలి" బుల్లమ్మాయి.

సీతమ్మ స్వగతం. "నేనెంతో సాయం చేశాను. బియ్యమూ పప్పులూ ఏం కావాలంటే అవి ఇవ్వలేదా? డబ్బు సాయం చేయలేదా? అయినా ఈ దొంగతనాలేమిటి? మేం జమీందార్లం అనుకొందా? మాకు డబ్బు చెట్టుందనుకొందా?"

చివరికి బుల్లమ్మాయిపై విరుచుకుపడింది. ఆమె ఖంగుతింది. ఆత్మాభిమానం దెబ్బతిని కళ్ల వెంట నీళ్లు. "అబ్బాయి మంచమెక్కాడు కనుక, ఆ మొగుడు సచ్చినోడు మమ్మల్ని ఏట్లో ముంచిపోయాడు కనుక మీకు లోకువయ్యాను అమ్మగారూ. ఇంత బతుకూ బతికి ఇంటెనకాల సావాల్సిన ఖర్మేం లేదమ్మగారూ. నాకు బుద్దొచ్చింది, వెళ్తా"నంటూ విసవిసా నడిచి వెళ్లిపోయింది.

బుల్లమ్మాయికీ సీతమ్మకీ అలా బెడిసింది. అవతల బుల్లమ్మాయి కుటుంబం ఏమయిందో చెప్పాలంటే, ఈ దేశంలో లక్షలాది ఆడవాళ్ల కథ చెప్పాలి కనుక, సాధ్యం కాదు. ఊహించుకోగలిగితే ఊహించుకోవాలి అంతే!

◆